

గిరిజనుల సాగులో ఉన్న భూములను పరిశీలిస్తున్న ప్రతినిధి బృందం

ఇచ్చేది మూరెడు.. చాకిరీ బారెడు

ఆశా కార్యకర్తలు: జిల్లాలో ప్రస్తుతం 2170; ఉమ్మడి జిల్లాలో 2800

డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశాలు(ఫైల్)

- ఆశా కార్యకర్తల ఆవేదన
- పనికి తగ్గ వేతనం ఒట్టిమాటే
- అందని ప్రభుత్వ సంక్షేమ పథకాలు

చదవడం, రాయడం వస్తే చాలని ఉద్యోగంలోకి తీసుకున్న ఆశా కార్యకర్తలకు తలకు మించిన పనులు అప్పగిస్తూ ప్రభుత్వం తీవ్ర ఒత్తిడిలోకి నెడుతోంది. కనీస శిక్షణ ఇవ్వకుండా వివిధ యాప్‌లలో సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలని బాధ్యతలను అంటగట్టడం ఉమ్మడి జిల్లాలోని వారిని తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది.

పనికి తగిన వేతనం ప్రాతిపదికన అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి న్యాయం చేస్తామని అధికారంలోకి రాకముందు పదేపదే ప్రకటనలు జారీ చేసిన రాజకీయ పెద్దల మాటలు నీటి మూటలయ్యాయని, ప్రశ్నించడానికి ప్రయత్నిస్తుంటే అణగదొక్కుతున్నారని పలువురు ఆశా కార్యకర్తలు కంటతడి పెడుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆశాలకు ఇచ్చేది మూరెడు.. చాకిరీ బారెడుగా మారింది. ప్రభుత్వం ప్రతి పనిలోనూ వీరిని భాగస్వామ్యం చేస్తోంది. ప్రతి నెలా ఇస్తున్న గౌరవ వేతనం కూడా ఒకేసారి ఇవ్వకుండా రెండు విడతలుగా ఇస్తోంది. కనీసం ప్రభుత్వ సంక్షేమ పథకాలైనా అందుతున్నాయా అంటే ప్రభుత్వ ఉద్యోగుల పేరుతో వీరి దరికి చేరడం లేదు. రూ.10వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న ప్రభుత్వం కరోనా సమయంలో ఆశాలు అమోఘమైన సేవలను అందించారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి మరీ సేవలు అందించారు. అటువంటి ఆశాలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది.

ఉద్యోగ విరమణలోనూ వ్యత్యాసం

ఉద్యోగ విరమణ అనంతరం ఎంతో కొంత చేతికందితే శేష జీవితానికి ఆసరాగా ఉంటుందనేది ఎవరికైనా చిరు ఆశ. ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచిన ప్రభుత్వం ఆశాలకు మాత్రం 60గానే ఉంచేసింది. పోనీ ఏదైనా ప్రయోజనం ప్రభుత్వం నుంచి అందుతుందా అంటే అది కూడా సున్నా. మొదట్లో కనీస విద్యార్హత ప్రాతిపదికన తీసుకొని ఇప్పుడు చెప్పిందల్లా చేయాలనే పరిస్థితి తీసుకొచ్చారని కార్యకర్తలు వాపోతున్నారు. ఎవరైనా గర్భిణులు, బాలింతలుంటే వారిని పిహెచ్‌సిలకు తీసుకెళ్లి సేవలందించడం మాత్రమే తెలిసిన తమను నిత్యం పని చేయాలని ఎఎన్‌ఎంల వెంట ఇంటింటికీ తిప్పుతున్నారని గగ్గోలు పెడుతున్నారు. గ్రామ సచివాలయాల దగ్గర నిత్యం హాజరవ్వాలని చెబుతున్నారని, ఇచ్చే దానికి చేసేదానికి ఎక్కడా పొంతనే లేకుండా ప్రభుత్వం ఆందోళనకు గురిచేస్తోందని కార్యకర్తలు వాపోతున్నారు.

ఆశాల జాబ్‌ఛార్టు

- ఆశా యాప్‌లో అన్ని వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. వారి పరిదిలో గర్భిణులను 12 వారాలలోపు ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలి.
- గర్భిణులు ఆరోగ్యకేంద్రానికి వెళ్లేటప్పుడు సహాయకారిగా ఉండాలి.
- అధిక ప్రమాదంగల గర్భిణులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.
- నవజాత శిశువులను 6/7 సార్లు 42 రోజుల్లోపు సందర్శించాలి.
- 15వ నెల వరకు పిల్లలను ఐదు సార్లు సందర్శించాలి
- రక్తహీనతగల శిశువులను గుర్తించి, ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేయాలి
- గర్భిణులకు వ్యాధి నిరోధక టీకా అందేలా చూడాలి.
- రెండేళ్లలోపు అత్యల్ప పోషకాహారలోపం గల పిల్లలను గుర్తించి ఎస్‌ఆర్‌సికి రిఫర్ చేయాలి.
- బిపి, మధుమేహంతో బాధపడే వారికి ముందులు సకాలంలో అందేలా చూడాలి
- టిబి రోగులున ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ డాటా ప్రొవైడరుగా మందులు ప్రతి నెలా అందేలా చూడాలి.
- ఆర్‌బిసికె, ఆర్‌కెసికెలో పాల్గొనాలి.
- కొత్తగా పెళ్లి అయిన, భార్యాభర్తలకు కాన్పు అంతరం గుర్తించి వివరించాలి.
- ప్రతి నెలా 5వ తేదీలోగా కొత్తగా పెళ్లి అయిన వారిని గుర్తించి ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలి.
- ప్రతి నెలా సమీక్షా సమావేశాలకు హాజరు కావాలి.
- ఫ్రైడే, డ్రైడేకు హాజరు కావాలి. హాజరును యాప్‌లో నమోదు చేయాలి.
- గ్రామ ఆరోగ్య రిజిస్టర్ నిర్వహించాలి.
- వారి పరిధిలో గృహాలను సందర్శించాలి.
- పోషకాహార లోపంతో ఉన్న పిల్లలను గుర్తించాలి.
- మలేరియా, డెంగీ, సీజనల్ జ్వరాలు ఉంటే పై అధికారులకు తెలపాలి.
- టిబి కేసులను గుర్తించి, పై అధికారులకు చెప్పాలి.

సంక్షేమ పథకాలు సున్నా

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి. పని గంటలు తగ్గించాలి. ఆశా కార్యకర్త చనిపోతే వారి ఇంట్లో ఒక్కరికి ఆశా పోస్టుతో పాటు, రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. ఆశా రికార్డులను ప్రభుత్వమే ఇవ్వాలి. ఎఎన్‌ఎం శిక్షణ పొందిన ఆశాలను ఎఎన్‌ఎంలుగా ప్రమోట్ చేసే సమయంలో మొదటి అవకాశం ఇవ్వాలి. జాబ్ చార్టు ప్రకారం పనులు అప్పగించాలి. రాజకీయ వేధింపులు అరికట్టాలి.

-జి.అమరావతి , ఆశా కార్యకర్తల సంఘం జిల్లా కార్యదర్శి

జాబ్‌ఛార్టుతో సంబంధమే లేదు

జాబ్‌ఛార్టు ప్రకారం పని చేయించాల్సి ఉంది. కానీ ఆశాలతో ఉదయం లేచిన మొదలు రాత్రి వరకు సంబంధం లేని పనులు చేయిస్తున్నారు. 24 గంటలూ పని చేయాలని చెబుతున్న అధికారులు అత్యవసరంలో సెలవు కూడా ఇవ్వడం లేదు. ప్రజలకు వైద్య ఆరోగ్యశాఖకు వారధులుగా మాత్రమే పని చేయాల్సిన వీరిని వైద్య సారథులుగా పని చేయాలంటే ఎంత వరకు న్యాయం. వీరిని సచివాలయాలకు, విలేజ్ క్లీనిక్‌లకు బదలాయింపు చేయరాదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. ఆశాల న్యాయమైన కోర్కెలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

-కె.నాగమణి, ఆశా కార్యకర్తల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు

గిరిజనులకు సాగు హక్కు కల్పించాలి

సిపిఎం ప్రతినిధి బృందం డిమాండ్

ప్రజాశక్తి - మెళియాపుట్టి

ఏళ్ల తరబడి భూముల్లో పంటలను సాగు చేస్తున్న గిరిజనులకు సాగు హక్కు కల్పించాలని సిపిఎం ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. శనివారం పెద్దమడి, నందవ కొత్తూరులో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.సూరయ్యతో కూడిన ప్రతినిధి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా గిరిజనులు తమ గోడును ప్రతినిధి బృందం వద్ద వినిపించారు. తరతరాలుగా గిరిజనుల సాగులో ఉన్న భూములు ఒడిశా రాష్ట్రానికి చెందిన వారి వద్ద కోనుగోలు చేశామని కొంతమంది వ్యక్తులు తప్పుడు పట్టాలు సృష్టించి మా భూములు గుంజుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలైనా అర్పిస్తాం కానీ భూములు మాత్రం విడిచి పెట్టేది లేదని తెగేసి చెప్పారు తప్పుడు పత్రాలు సృష్టించిన వారిపై ప్రభుత్వం దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని, గిరిజనుల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3న మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని వారు తెలిపారు. సిపిఎం ప్రతినిధి బృందం నాయకులు మాట్లాడుతూ గిరిజనులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. గిరిజనులు ఒంటరిగా లేరని, వారికి అందరి మద్దతు ఉందని తెలిపారు.

గిరిజనుల సాగులో ఉన్న భూమికి గిరిజనేతరలకు పట్టాలు ఏ విధంగా వచ్చాయని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు జన్ని రామకృష్ణుడు, పోరాట కమిటీ కన్వీనరు పి.బాలరాజు, ఎస్.విమలకుమారి, పి.హేమ, చలపతి, టి.మహాలక్ష్మి, పి.కృష్ణవేణి, ఎ.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ పాస్‌వే వద్ద నిలిచిన వర్షపునీరు

నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

రాకపోకలు బంద్

- రైల్వే అండర్ పాస్‌వేలో నిలిచిన వర్షపునీరు
- వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి- పొందూరు, శ్రీకాకుళం అర్బన్

మండలంలోని బొడ్డేపల్లి వద్ద ఇటీవల నిర్మించిన రైల్వే అండర్ పాస్‌వే వద్ద భారీగా వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బొడ్డేపల్లి-తాడివలస గ్రామాల మధ్యన ఉన్న రైల్వే అండర్ పాస్‌వేలోకి భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో ద్విచక్ర వాహనదారులు, ప్రజల రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా పొందూరు, ఆమదాలవలస, సంతకవిటి మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి చేరుకునేందుకు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. నీరు చేరడంతో ఇప్పుడు ఎలా వెళ్లాలని ఆవేదన చెందుతున్నారు.

డిఆర్ఎంకు ఎంపీ ఫిర్యాదు

రైల్వే అండర్ పాస్‌వేల వద్ద వర్షపునీరు నిల్వ లేకుండా కాలువలను నిర్మించాలని రైల్వే డిఆర్‌ఎంను ఎంపీ రామ్మోహన్‌నాయుడు కోరారు. విశాఖలో ఉన్న డిఆర్‌ఎంకు ఆయన ఫోన్ చేసి, సమస్యను వివరించారు. తక్షణమే కాలువల నిర్మాణం చేపట్టి, శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. రైల్వే ఇంజినీరింగ్ అధికారులతో పరిశీలించి, సమస్యను పరిష్కరించాలని ఎంపీ కోరారు.

పోస్టరును ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

'ఉపాధి' రక్షణకు ఉద్యమిద్దాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధి రక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని, దీని కోసం ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సిర్ల ప్రసాద్, జి.సింహాచలం కోరారు. వ్యకాస జిల్లా కార్యాలయంలో శనివారం చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ పేదలకు పనైనా చూపండి, తిండి అయినా పెట్టండి అని దశాబ్దాలుగా సాగిన ఉద్యమాల ఫలితంగా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వచ్చిందని, కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని నీరుగార్చి, నిధులు లేకుండా చేస్తోందని విమర్శించారు. పేదరిక నిర్మూలన, వలసల నివారణ, గ్రామీణ పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం లాంటి ఉన్నతమైన లక్ష్యాలతో ఉపాధి హామీ చట్టం వచ్చిందని తెలిపారు. ఈ చట్టం గ్రామీణ పేదలకు పెద్ద ఆసరాగా ఉందని, ఈ చట్టం వచ్చాక గ్రామీణ పేదల జీవన ప్రమాణం కొంత మెరుగైందని అనేక సర్వేలు తెలియజేస్తున్నాయని అన్నారు. దీన్ని పట్టణాలకు కూడా విస్తరించి మరింత విస్తృతపరచాలని దేశంలోని మేధావులు, ఆర్థికవేత్తలు ప్రభుత్వాన్ని కోరుతున్నారని చెప్పారు. 200 రోజులు పని దినాలు, రూ.2లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తుంటే మోడీ ప్రభుత్వం మూడేళ్లుగా క్రమంగా కేటాయింపులు తగ్గిస్తూ వస్తోందన్నారు. ఈ ఏడాది 33శాతం కోత కోసి కేవలం రూ.60వేల కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో గత ఏడాది బకాయిలు పోతే మిగిలేది నామ మాత్రమేనని ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి హామీ రక్షణ కోసం ఉద్యమించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

ఆహార భద్రతా చట్టం దేశంలో ఉన్న 80 కోట్ల మంది ప్రజలకు కొంత ఉపశమనం కల్పిస్తుందని, ఆ చట్టానికి తూట్లు పొడిచారని అన్నారు. మోడీ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించేందుకు చేపట్టిన చలో ఢిల్లీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం సామాన్యులపై భారాలు మోపి అంబానీ, ఆదానీలాంటి కార్పొరేట్లకు దేశ సంపదనంతా కట్టబెట్టడాన్ని వివరిస్తూ ప్రజలను చైతన్య పరుస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకులు. కె.ఎల్లయ్య. డి.భాస్కరరావు. తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పెద్దపీట

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- 4.54 లక్షల మందికి రూ.310.21 కోట్లు జమ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ.., వారికి ఆర్థికంగా చేయూతను ఇచ్చేందుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. దెందులూరులో మూడో విడత వైఎస్‌ఆర్ ఆసరాను సిఎం జగన్ డిబిటి విధానంలో నగదును జమ చేశారు. స్థానిక బాపూజీ కళా మందిరంలో డిఆర్‌డిఎ, మెప్మా ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. బ్యాంకు రుణాల మొత్తాన్ని నాలుగు విడతల్లో పొదుపు సంఘాల ఖాతాలకు జమ చేస్తామని ఇచ్చిన హామీల్లో భాగంగా మూడో విడత నిధులు జమ చేయడం జరిగిందన్నారు. దీనివల్ల మహిళా సాధికారత మరింత మెరుగుపడి, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద మహిళల ఆర్థిక పురోగతికి దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టే విధానాల్లో ఇంటిల్లపాదిని శక్తివంతులుగా చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఆసరా ద్వారా 4.54 లక్షల మంది మహిళలకు రూ.310.21 కోట్లను జమ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా నమూనా చెక్కును ఆయన మహిళలకు అందజేశారు. తొలుత అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం సందర్భంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన చిరుధాన్యాల ప్రదర్శనను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలూ మహిళలకే లబ్ధిచేకూరేలా ప్రవేశపెట్టినట్లు చెప్పారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందన్నారు. మహిళలకు ఇటువంటి కార్యక్రమాల వల్ల సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ వైశ్య, తూర్పు కాపు, పొందర, కాపు కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, రాజాపు హైమావతి, పేరాడ తిలక్, రాష్ట్ర మహిళా ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ బి.హేమమాలినిరెడ్డి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ చల్లా సుగుణ, మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, మూల కృష్ణవేణి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, సెట్‌శ్రీ సిఇఒ బి.వి.ప్రసాదరావు, ఎన్‌వైకె సమన్వయకర్త ఉజ్వల్, వ్యవసాయశాఖ జెడి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి ధర్మాన

తాగునీటికి కొరత లేకుండా చర్యలు

జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రానున్న వేసవిలో జిల్లాలో తాగునీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ ఆదేశించారు. శనివారం జెడ్‌పి సమావేశ మందిరంలో 2, 4, 5, 1, 6, 7 స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ రానున్న వేసవిలో ప్రజలకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య అధికారులను ఆదేశించారు. 2వ స్థాయీ సంఘ సమావేశంలో గృహ నిర్మాణశాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, చేనేత, జౌళి శాఖ, ముఖ్య ప్రణాళికాధికారి శాఖల వారీగా సమీక్షలు నిర్వహించి, మరింత మెరుగ్గా సేవలు అందించాలని కోరారు. ప్రతి పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఫర్నిచర్, ఇతర ఎన్నో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామని, అవి చోరీకి గురయ్యే అవకాశం ఉన్నందున వాచ్‌మేన్ ఏర్పాటుకు సిఎంను కోరినట్లు విజయ చెప్పారు. ఇందుకు ముఖ్యమంత్రి స్పందిస్తూ పాఠశాలల్లో రాత్రి వేళల్లో కాపలాదారులను నియమించేలా ఉత్తర్వులు జారీచేసిందన్నారు. పాఠశాలలకు వేసవి సెలవులు సమీపిస్తుండటంతో పై నియామకాలు ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పలాస, టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలైన సోంపేట, కవిటిలో కిడ్నీ రోగులకు డయాలిసిస్ యూనిట్ ఏర్పాటుపై తగిన చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్, గనుల శాఖ, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖల వారీగా సమీక్షించారు. సమావేశంలో సిరిపురపు జగన్మోహనరావు, పాలిన శ్రావణి, జంపు కన్నతల్లి, హౌసింగ్ పిడి విద్యాసాగర్, డ్వామా పీడీ చిట్టిరాజు, పశుసంవర్థకశాఖ సంయుక్త సంచాలకులు ఎం.కిశోర్, ఎ.కాళేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిరియా విజయ

అన్నదాతల కష్టాలు పట్టవా?

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి

అన్నదాతలను ఖరీఫ్ కష్టాలు వీడటం లేదు. కొనుగోళ్లు జరగక కళ్లాలోనే ధాన్యం ఉండిపోయింది. మరోవైపు వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులను కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. కళ్లాల్లో ఉన్న ధాన్యం కాపాడుకోవడానికి నానా పాట్లు పడుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం సాగించిన బేరాసారాలు రైతులను వర్షాలకు దొరికిపోయేలా చేశాయి. పండిన పంటలో 70 శాతమే కొనుగోలు చేస్తామని చెప్తూ వచ్చింది. జిల్లాలో 8,11,120 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేసినా అధికారులు రైతుల సొంత అవసరాలు, ఇతర అమ్మకాలు పోను సుమారు 4.38 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని చెప్పి కొనుగోళు మొదలు పెట్టింది. ఫిబ్రవరి మొదటి వారంలోనే ఆ లక్ష్యం పూర్తయిపోయింది. రైతుల వద్ద ఇంకా ధాన్యం ఉండిపోవడంతో తీవ్ర వ్యతిరేకత వస్తుందన్న అధికారుల సూచనతో మరో 70 వేల టన్నులకు అనుమతిచ్చి 5.08 లక్షల మెట్రిక్ టన్నులతో సరిపుచ్చాలని చూసింది. ఆ లక్ష్యం పూర్తవ్వడంతో ఫిబ్రవరి 27న కొనుగోళ్లు ఆపేసింది. అపరాల సాగుతో జిల్లాలో చాలా ప్రాంతాల్లో ఆలస్యంగా నూర్పులు జరగడంతో మార్చి మొదటి వారంలో ధాన్యం సిద్ధమయ్యాయి. తమ ధాన్యం కొనాలంటూ అధికారులపై రైతులు తీవ్ర ఒత్తిడి చేశారు. రైతుల్లో నెలకొన్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం మరో 50 వేల క్వింటాళ్లకు అనుమతులిచ్చింది. రైతుల వద్ద ఇంకా మరో లక్ష టన్నుల వరకు ధాన్యం ఉంటుందని అంచనాగా ఉంది. మిగిలినపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా? లేక బయట వ్యాపారులకు అమ్ముకోవడమేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు ఆపేయడంతో వర్షాలకు భయపడి రైతులు ఇప్పటికే 50వేల క్వింటాళ్లను దళారులకు అమ్ముకున్నారు. ఇదే అదనుగా దళారులు ధాన్యానికి తక్కువ ధర ఇచ్చి కొనుగోలు చేశారు. క్వింటా ధాన్యాన్ని రూ.1300 నుంచి రూ.1400 మధ్య మాత్రమే రైతులకు చెల్లించారు. అదే ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తే క్వింటాకు రూ.1632 దక్కేది. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం వ్యవహరించిన నాన్చుడు వైఖరితో రైతుల కష్టంలో కొంత భాగం దళారుల పాలైంది.

జిల్లాలో వారం రోజులుగా పడుతున్న అకాల వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చేతికొచ్చిన పంటను కాపాడుకోలేక నానా పాట్లు పడుతున్నారు. ముఖ్యంగా మొక్కజొన్న పంట ఈ సారి ఆశాజనంగా ఉంది. ఈ ఏడాది మంచి దిగుబడి వస్తుందని ఆశ పడ్డ రైతులకు ఆకాల వర్షాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కోసిన పంట కళ్లాలు, రోడ్లపైనే ఉండటంతో దినదిన గండంగా మారింది. ప్రభుత్వం ఇప్పటికే పెసలు, మినుములు కొనుగోలు చేయాల్సి ఉన్నా ఆ పని ప్రారంభించకపోవడంతో వారు కూడా వర్షానికి దొరికిపోయారు. ఉప్పు పంట పండే మంచి సీజన్‌లో వర్షాలు పడటంతో గల్లీలు వర్షపు నీటితో నిండిపోతున్నాయి. మరోవైపు అమ్ముకునేందుకు సిద్ధం చేసిన ఉప్పు బస్తాలు వర్షానికి కరిగిపోయి రైతులకు కన్నీళ్లను మిగులుస్తున్నాయి. ధాన్యం కొనుగోలు జరగక, అకాల వర్షాలకు చేతికొచ్చిన పంటను కాపాడుకోలేక రైతులు సతమతమవుతుంటే ప్రధాన రాజకీయ పక్షాలు పరస్పరం దుమ్మెత్తిపోసుకుంటున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపోటములపై నాయకులు విమర్శలకు దిగుతున్నారు. ఎమ్మెల్సీ స్థానాన్ని టిడిపి కైవసం చేసుకోవడంతో పార్టీ నాయకులు, శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్సీ గెలుపుతో టిడిపి అధికారంలోకి రాబోతున్నట్లుగా కలలు కంటున్నారు. టిడిపి గెలుపుతో రాష్ట్రానికి మంచి జరగబోతున్నట్లుగా చెప్పుకుంటున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు మంచి జరిగేలా చేయడంపై మాత్రం ఏ కోశాన ఆలోచించడం లేదు. టిడిపి సంబరాలు, విమర్శలపై వైసిపి కూడా అదే స్థాయిలో స్పందించింది. ఎన్నికల ఫలితాలు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభావం చూపవంటూ పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పార్టీ శ్రేణుల నైతిక స్థైర్యం దెబ్బతినకుండా జాగ్రత్త పడ్డారు. ఎన్నికలు అన్ని తరగతలకు ప్రాతినిధ్యం వహించవంటూ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాటలనే వల్లించారు. మొత్తం మీద ఇరు పార్టీలు ప్రజలు, రైతుల సమస్యలను విస్మరించి గెలుపోటములపై ఒకరినొకరు విమర్శించునే పనిలో పడ్డారు. ధాన్యం కొనుగోళ్లు, పంట నష్టంపై రైతు సంఘాలు మాట్లాడుతున్నాయి తప్ప వైసిపి, టిడిపి నుంచి ఆ రకమైన స్పందన కరువైంది. ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఇప్పటికూనా ఇరు పార్టీలు ప్రజా సమస్యలపై దృషి పెడితే కొంతవరకైనా జనానికి మేలు ఒనగూరుతుంది.

గ్రామపంచాయితీ కార్యాలయం - టెక్కలి

రేఖా నెం : 71/2023/ఎ, **బహిరంగ వేలం ప్రకటన** తే.25.03.2023 ది.

టెక్కలి గ్రామపంచాయితీకి చెందిన ఈ దిగువ తక్తాలో చూపిన గుత్తలు 2023-24 సం.నకు అనగా 01.04.2023 నుండి 31.03.2024 వరకు ఆశీల్లు వసూళ్లు చేసుకునేందుకు మరియు అనుభవించుకొనుటకై గుత్త హక్కు ఇచ్చుటకు గూర్చి.

తే.29.03.2023 దీ బుధవారం ఉదయం గం.11.00 ల నుండి టెక్కలి గ్రామ పంచాయితీ కార్యాలయములో కార్యదర్శి / సర్పంచ్ / EOPR & RD /వారిచేగాని బహిరంగ వేలం పాట నిర్వహించబడును. వేలం పాటలో పాల్గొనదలచినవారు శ్రీ డివిజనల్ పంచాయితీ అధికారి టెక్కలి వారి (అప్ సెట్ ప్రైస్)కు లోబడి తక్కువ కాకుండా మరియు పంచాయితీ వారి షరతుల ఆమోదంకు లోబడి పాట సమయమందు నగదు రూపంలో ధరావత్తు మరియు సాల్వేన్సీ ఈ క్రింద తక్తాలో చూపిన విధముగా కార్యనిర్వహణాధికారి / పంచాయితీ కార్యదర్శి వారికి కాని లేదా వారి అనుమతి పొందిన వారికి కానీ అందజేసి ఈ దిగువ పట్టిక చూపిన విధముగా ఆయా గుత్తలకు నిర్ణీత వేలం పాట ధరావత్తులు చెల్లించి వేలం పాటలో పాల్గొనవలెను.

తక్తా

వ.నెం.	గుత్త వివరము	లీజు కాలము	చెల్లించవలసిన నిర్ణీత ధరావత్తు
1.	రోజు వారి మార్కెట్టు	2023-24 సం.. నకు	రూ.1,00,000/- లు
2.	వారపు సంత	2023-24 సం.. నకు	రూ.10,000/- లు
3.	బస్సు మరియు కారు స్టాండు	2023-24 సం.. నకు	రూ.20,000/- లు
4.	కమేళా	2023-24 సం.. నకు	రూ.10,000/- లు

గ్రామ పంచాయితీ సర్పంచ్ వారి కుటుంబ సభ్యులు కానీ / మరియు పాలకవర్గ సభ్యులు కానీ గ్రామ పంచాయితీకి ఏవిధమైన బకాయి ఉన్నను వేలం పాటలో పాల్గొనుటకు అనర్హులు ఇతర వివరములకు కార్యలయం పయిచేయు వేళలో వచ్చి అడిగి తెలుసుకొనవలెను.

నోట్: వేలాం పాట ఖరారు పంచాయితీ వారి ఆమోదమునకు లోబడి యుండును.

సం/- పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ, టెక్కలి.

చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లక్ష్మీదేవి

బిసిల పక్షపాతి చంద్రబాబు

మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వెనుకబడిన ప్రజలను ఉద్ధరించడానికి నాలుగు దశాబ్దాల క్రితం టిడిపి పుట్టిందని, ఇప్పటికీ అదే ఒరవడిని కొనసాగిస్తూ చంద్రబాబు బిసిలకు పార్టీలో ప్రాధాన్యత ఇస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. ఇటీవల నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాలుగు స్థానాలను దక్కించుకుని విజయాన్ని సొంతం చేసుకున్న సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందించి బిసిలు ఆర్థికంగా రాజకీయంగా ఉన్నతస్థాయికి తీసుకొచ్చిన ఘనత టిడిపికే ఉందన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్లకు పెద్దఎత్తున నిధులు ఇచ్చి అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, బిసి నగర అధ్యక్షులు ఉంగటి రమణ, గార మండలం తెలుగు యువత అధ్యక్షులు మల్ల నర్సింగరావు, విశ్వబ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు పల్లా పార్వతీశం, తెలుకుల సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు వెంకటరమణరాజు, సురకాసి వెంకటరావు, కవ్వాడి సుశీల పాల్గొన్నారు.

రామారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం సభ్యులు

ఎమ్మెల్సీ 'నర్తు'కు సన్మానం

ప్రజాశక్తి- కవిటి

ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ నర్తు రామారావు కృషి చేస్తున్నారని అగ్నికుల క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు గొరకల వసంత స్వామి అన్నారు. మండలంలోని కొత్తపుట్టుగలో శనివారం కలిసి శుభాకాంక్షలు తెలియజేసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ జుత్తు నీలకంఠం, జిల్లా ప్రధాన కార్యదర్శి పులకల శ్రీరాములు, సభ్యులు లక్ష్మణరావు, రామ్‌బుడ్డి గణపతిరావు, తిమ్మల ఉమామహేశ్వరరావు, పాతిన వెంకటరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అధికారులే గైర్హాజరైతే ఎలా?

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైతే ఎలా అని మండల పరిషత్ అధ్యక్షులు తమ్మినేని శారద ప్రశ్నించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం తగదన్నారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సమావేశానికి హాజరు కాకపోతే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని అసహనం వ్యక్తం చేశారు. కల్వర్టులు, గెడ్డ గట్టులు శిథిల స్థితి చేరుకుని అధ్వానంగా ఉన్నాయని, వాటిని నాగావళి నది విభాగపు ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడంలేదని పిహెచ్‌సి అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, టిడిపి ఎంపిటిసి అన్నెపు భాస్కరరావులు మండిపడ్డారు. నాగావళి నది విభాగపు అసిస్టెంట్ ఇంజినీర్ సభకు హాజరు కాకపోవడంతో ఆయనకు నోటీసు పంపించి వివరణ తీసుకోవాలని ఎంపిడిఒను ఎంపిపి ఆదేశించారు. కనుగులవలసలో జగనన్న కాలనీలో ఇంతవరకు లబ్ధిదారులు ఇళ్లను నిర్మించడానికి ముందుకు రావడం లేదని, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడమే కారణమని హౌసింగ్ అధికారులపై సర్పంచ్ నూకరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడో 'ఫేజ్'లో మంజూరు కావడంతో త్వరలో పనులను ప్రారంభిస్తామని హౌసింగ్ ఎఇ బదులిచ్చారు. గ్రామాల్లో జగనన్న కాలనీ లబ్ధిదారులకు మీటరు, వైర్, ఎర్త్ పైపు తదితర సామగ్రిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని రూరల్ ఎఇ రవికుమార్ తెలిపారు. కొరపాంలో ప్రభుత్వ పాఠశాల కూలిపోయే దశలో ఉందని, గత మూడు సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని సర్పంచ్ చేపేన సత్తిరాజు సభ దృష్టికి తీసుకొచ్చారు. 'ఫేజ్-3 నాడు-నేడు కింద పాఠశాలను ఆధునీకరిస్తామని ఎంఇఒ దువ్వల రామారావు తెలిపారు. భవనాల తొలగింపునకు విద్యా కమిటీలో తీర్మానం చేసి అందజేయాలని కోరారు.

వేసవి దృష్ట్యా ఉదయం 10 గంటల ముందు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఎవరూ బయటకు వెళ్లరాదని తొగరం పిహెచ్‌సి వైద్యులు ఎం.ప్రవంతి సభ్యులకు తెలియజేశారు. ఉపాధి హామీ పనులు చల్లని వేళలో చేయించాలన్నారు. ఈ క్రాప్ చేసిన ధాన్యాన్ని రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేయకపోవడం ఏమిటని, మండలంలోని మిల్లులకు ధాన్యాన్ని కేటాయించకుండా ఇతర మండలాల మిల్లులకు ధాన్యాన్ని పంపించడం ఏమిటని ఎఒ మెట్ట మోహనరావు దృష్టికి భాస్కరరావు, నూకరాజులు తీసుకొచ్చారు. ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. కొర్లకోట, జొన్నవలస, దూసి, నిమ్మతొర్లాడల్లో ప్రభుత్వం ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, 2016 ముందు ఆధార్ కార్డులను తీసుకున్న వ్యక్తులు వాటిని నవీకరించుకోవాలని ఎంపిడిఒ ఎం.రేణుక కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బెవర కృష్ణవేణి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తున్న శ్రీనివాసరావు, భాస్కరరావు

ఐక్య పోరాటాలే శరణ్యం

సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్

ప్రజాశక్తి- రణస్థలం

సర్పంచ్‌ల, పంచాయతీల సమస్యలు పరిష్కారానికి ఐక్యపోరాటాలే శరణ్యమని సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ పిలుపునిచ్చారు. సర్పంచ్‌ల సంఘ ఆర్గనైజింగ్ రాష్ట్ర సెక్రటరీ, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకటభానోజీనాయుడు అధ్యక్షతన వెంకట భానోజీనాయుడు గెస్ట్‌హౌస్ ఆవరణలో ఎచ్చెర్ల నియోజకవర్గస్థాయి సర్పంచ్‌ల అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. పంచాయతీలకు నిధులను ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని అఖిలపక్ష పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశం పేర్కొంది. స్థానిక సంస్థల హక్కులను కాపాడుకునేందుకు రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలని తెలిపింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చిన నిధులను సర్పంచ్‌ల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయాలను సర్పంచ్‌ల నిర్వహణలోకి తీసుకోవాలన్నారు. సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు రూ.15 వేలు, ఎంపిపి, జడ్‌పిటిసిలకు రూ.30 వేల చొప్పున గౌరవవేతనం ఇవ్వాలన్నారు. పాత పద్ధతిలో ఉపాధి హామీ నిధులను సర్పంచ్‌లకు ఇవ్వాలన్నారు. నిర్వీర్యమవుతున్న స్థానిక సంస్థలను రాజ్యాంగ బద్ధంగా బలపర్చాలని సర్పంచ్‌లు సాగిస్తున్న ఆందోళన న్యాయబద్ధమైందన్నారు. దీనికి పార్టీలకు అతీతంగా పూర్తి మద్దతుని ఇవ్వాలని పిలుపునిచ్చారు. వెంకట భానోజీనాయుడు మాట్లాడుతూ విడుదల నిధులనూ రాష్ట్ర ప్రభుత్వం దొడ్డిదారిన కొల్లగొడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంఘం మండల నాయకులు బగాది అప్పలనాయడు, టి.వెంకటరావు, ఎస్.అప్పన్న, ఆకుల రవికుమార్, బాలి శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గొండు శంకర్

కవితా పోటీలకు దరఖాస్తుల స్వీకరణ

రణస్థలం : ఈవేమన కవితా నిలయం తపస్వి మనోహ రం సంయుక్త ఆధ్వర్యాన ఉత్తరాంధ్ర వచన, పద్య కవితల పోటీలకు ఉత్తరాంధ్ర జిల్లాల కవులు, కవయిత్రుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కవితా పోటీ నిర్వాహకు లు మహ్మద్ రఫీ (ఈవేమన), జంధ్యాల శరత్‌బాబులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, మన్యం అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, మన్యం పార్వతీపురం జిల్లాల కవులు, కవయిత్రులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక్కొక్కరూ 20 వరుసలకు మించని వచన కవిత, ఐదు పద్యకవితలు (20 వరుసలు) నిడివి గల తెలు గుదనం, సామాజిక బాధ్యత గల కవితలు పంపాలన్నారు. ప్రతిఒక్కరూ రెండు ప్రతులు పంపాల న్నారు. మీరు పంపే కవితలు మే 5లో చేరాలని, ఆపై చేరిన కవితలు పోటీకి అనర్హమని అన్నారు. వీటిలో ఎంపి క చేసి ముగ్గురు విజేతలకు రూ.వెయ్యి చొప్పున, మరో పోత్సాహక బహుమతిగా ఇద్దరు విజేతలకు రూ.500 చొప్పున నగదు బహుమతి ఉంటుందని తెలిపారు. పం పాల్సిన చిరునామా మహ్మద్ రఫీ (ఈవేమన), ఎస్-1 శారదా అపార్ట్‌మెంట్, లక్ష్మీనగర్, రణస్థలం-532407 చిరునామాకు పంపించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- ఆమదాలవలస

గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ వై.కృష్ణ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... పట్టణంలోని బొడ్డేపల్లిపేట కూడలి వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు యాచకుడిగా అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వయసు 40 ఏళ్లు ఉంటుందన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు సంబంధీకులు ఎవరైనా ఉంటే స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. విఆర్‌ఒ బెహరా ఫిరోజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించామని తెలిపారు.

గుండెపోటుతో ఎఎస్ఐ మృతి

భాస్కరరావు (ఫైల్)

కవిటి: కవిటి పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న దిండు భాస్కరరావు (59) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఇచ్ఛాపురంలో నివాసం ఉంటున్న భాస్కరరావు రాత్రి భోజనం తరువాత ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయి ప్రాణాలు కోల్పోయారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆయనకు భార్య భారతి, ఇద్దరు కుమారులు సాయికుమార్, పవన్ కుమార్ ఉన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ అనురాధ

ఎయిడ్స్‌పై అప్రమత్తత

శ్రీకాకుళం అర్బన్ : ఎయిడ్స్ వ్యాధి ప్రబలకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ ఎన్.అనురాధ అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం అంపోలులో ఉన్న జిల్లా కేంద్ర కారాగారంలో సాతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ఖైదీలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ ఏ ఒక్కరి జీవితంలోకీ రాకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం ఖైదీలకు హెచ్ఐవి/ఎయిడ్స్, టిబి, సుఖవ్యాధులపై అవగాహన కల్పించి రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ కె.ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్ శ్రీనివాసరావు, జైల్ సూపరింటెండెంట్ నబీఖాన్, జైలర్ దివాకర్, వార్డెన్ శంకర్‌రెడ్డి, సాతి ప్రోగ్రామ్ --ఆర్డినేటర్ ఎస్.మేనక పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

వర్షపు నీటిని ఒడిసిపట్టాలి

లావేరు : వర్షపునీటిని ఒడిసిపట్టాలని చిలకపాలెం శివాని ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నక్కపేటలో శివానీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన వర్షనీటిని ఒడిపట్టు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులతో వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, ఎన్ఎస్ఎస్ పిఒ బి.ప్రసాదరావు, వాలంటీర్లు చందన, రవీంద్ర పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు ఆరుగురు ఎంపిక

బూర్జ : జాతీయ ఉపకార వేతనానికి (ఎన్ఎంఎంఎస్) కు బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం ధర్మాన కృష్ణవేణి తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షా ఫలితాల్లో జి.నీరజ, టి.వంశి, ఎన్.సుందరమ్మ, కె.షర్మిళ, బి.హారికలు ఎంపికయ్యారని అన్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందజేస్తుందని అన్నారు. అలాగే ఓ.వి.పేటలో మోడల్ స్కూల్‌లో చదువుతున్న వి.సుజన ఉపక వేతనానికి ఎంపికైందని ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు తెలిపారు.



రాగి జావను పరిశీలిస్తున్న అధికారులు

రాగిజావ పరిశీలన

మెళియాపుట్టి : మండలంలోని నడసంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత, మండల పరిషత్ పాఠశాలల్లో అమలవుతున్న రాగిజావ పంపిణీని తహశీల్దార్ పి.సరోజని, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాగిజావ రోగనిరోధక శక్తిని పెంచుతుందన్నారు. కాలేయంలో కొవ్వును నిర్మూలిస్తుందని, ఎముకులను దృఢపరుస్తుందని అన్నారు. రక్తహీనతను నివారిస్తుందని పేర్కొన్నారు. గుండె ఆరోగ్యానికి, రక్తం ఉత్పత్తికి దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ రమేష్ చౌదరి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శివరాంపాడి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పోలాకి: మండలంలో గుల్లవానిపేటకు చెందిన దుమ్ము గన్నయ్య ఇటీవల వెళ్లి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్వగ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. మృతిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా గన్నయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. టిడిపి నాయకులు కె.వేణు, ఎం.వెంకట అప్పలనాయుడు, ఎల్.రాంబాబు, బి.బాస్కరరావు, డి.తవిటియ్య పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న రమణమూర్తి

తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలి

మందస: బోయి, వాల్మీకి, బెంతు ఒరియాలకు కులస్తులకు ఎస్‌టి జాబితాలో చర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి అసెంబ్లీలో చేసిన తీర్మాణాన్ని వెంటనే ఉపసరించుకోవాలని గిరిజన సంఘం డిమాండ్ చేసింది. మందస సిఐటియు కార్యాలయంలో శనివారం గిరిజనులు మాట్లాడుతూ ఓట్ల కోసం అగ్రవర్ణ కులాలైన బోయి, వాల్మీకి, నకిలీ బెంతు ఒరియా కులస్తులకు ఎస్‌టి జాబితాలో చర్చరాదన్నారు. ఇప్పటికైనా అసెంబ్లీ తీర్మానం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సవర రామారావు, సవర ధర్మారావు, సవర గురునాద్‌లు పాల్గొన్నారు.

పలాస : బోయి, వాల్మీకి, బెంతు ఒరియాలకు కులస్తులకు ఎస్‌టి జాబితాలో చేర్పించేందుకు అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించి బిల్లు ఆమోదానికి కేంద్రానికి పంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదివాసీ సంఘాల జెఎసి జిల్లా అధ్యక్షులు సవర రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వైసిపి రాజకీయ లబ్ధి కోసం, ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తుందన్నారు. వైసిపికి రానున్న రోజుల్లో గిరిజనులు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. అసెంబ్లీలో ఏడుగురు ఎస్‌టి ఎమ్మెల్యేలు ఉన్నా నోరు మెదపకుండా సోద్యం చూడడం సరికాదన్నారు. కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆదివాసులమంతా కలిసి పోరాటానికి కార్యాచరణ సిద్ధం చేసుకుని ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

ధాన్యం కొనుగోలులో ఇంత నిర్లక్ష్యమా?

నిలదీస్తున్న సభ్యులు

కొత్తూరు: రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో దళారులను ఆశ్రయిస్తున్నారని, వ్యవసాయాధికారుల నిర్లక్ష్యానికి ఇదొక నిదర్శనమని కుంటిభద్ర ఎంపిటిసి అగతముడి సుశీల, ఆకులతంపర సర్పంచ్ నాగళ్ల అప్పన్న, పొన్నుటూరు సర్పంచ్ ప్రతినిధి ఎద్దు సంతోష్‌కుమార్ ఎఒ శ్రీనివాసరావును నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సవర సావిత్రి అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులను అవగాహన కల్పించకుండా కార్యాలయాలకే పరిమితమయ్యారన్నారు. విద్యార్థులకు ఉచితంగా ఇచ్చే టాబ్‌ల పంపిణీ నాయకులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ఎంఇఒ బి.శ్రీధర్‌ను ప్రశ్నించారు. కొత్త సంఘాలను ఏర్పాటు చేయడంలో వెలుగు సిబ్బంది ఆసక్తి చూపించడం లేదని మెట్టూరు బిట్-2 సర్పంచ్ వై.ధర్మారావు ఎపిఎం త్రినాథమ్మను నిలదీశారు. ఉపాధి హామీ ద్వారా కొత్తగా వచ్చే పనులను ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని మెట్టూరు బిట్-1 సర్పంచ్ అడపక శంకరరావు ఎపిఒ ప్రేమలత అడిగారు. దీనిపై ఆమె స్పందిస్తూ... ఈ సారి తప్పకుండా తెలియజేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పావని, ఇఒపిఆర్‌డి కృష్ణారావు, ప్రత్యేకాహ్వానితులు అంపిలి ప్రశాంత్ కుమార్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు విక్రయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరంలోని బాపూజీ కళామందిర్‌లో చిరుధాన్యాల మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ విభాగం స్టాల్‌ని శనివారం ఏర్పాటు చేశారు. దీనిలో ప్రకృతి సాగులో పండించిన చిరుధాన్యాలతో తయారు చేసిన వివిధ రకాల ఆహార ఉత్పత్తులను, బెల్లాన్ని విక్రయానికి పెట్టారు. ముఖ్యంగా చిరుధాన్యాలతో తయారు చేసిన పిండి వంటకాలు, బెల్లాన్ని సందర్శకులు చాలా ఉత్సాహంగా కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్టు మేనేజర్ రేవతి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతిఒక్కరూ పోషకాహార లోపాలతో చాలా రకాల ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దీన్ని అధిగమించాలంటే అన్ని పోషక విలువలతో కూడిన చిరుధాన్యాలను అందరూ ఆహారంగా తీసుకొంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని అన్నారు. ఈ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందరూ ప్రోత్సహించి ఉత్పత్తులను కొనుగోలు చేసి రైతులకు ఆర్థికంగా మరింత వ్యవసాయం చేయడానికి ప్రోత్సహించేలా చూడాలని కోరారు. అందరూ ఇందులో భాగస్వాములై గ్రామంలోని సంపదను పెరిగేలా చూడాలన్నారు.

విక్రయిస్తున్న సిబ్బంది

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా విజయలక్ష్మి

ఆమదాలవలస : పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కనితి విజయలక్ష్మి ఎన్నికయ్యారు. పట్టణంలోని బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు కోర్టు ఆవరణలో శనివారం బార్ అసోసియేషన్ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్ష ఎన్నికలో సీనియర్ న్యాయవాదులు కణితి విజయలక్ష్మి, పైడి వరహా నరసింహులు పోటీ పడ్డారు. ఈ ఎన్నికలో విజయలక్ష్మి 10 ఓట్ల తేడాతో గెలుపొందారు. బార్ కౌన్సిల్లో 64 ఓట్లు ఉండగా, 56 ఓట్లు పోలయ్యాయి. అందులో విజయలక్ష్మికి 33, వరహా నరసింహులుకు 23 ఓట్లు వచ్చాయి. గతేడాది జరిగిన ఎన్నికల్లో విజయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఏడాది పోటీ చేసి రెండోసారి గెలుపొందారు. మహిళ అధ్యక్షులుగా ఎన్నిక కావడం రాష్ట్ర చరిత్రలోనే ప్రథమమని, విజేతగా నిలిచిన ఆమెకు పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

విజయలక్ష్మి

అభివృద్ధికే ప్రాధాన్యం

బడ్జెట్ సమావేశంలో చైర్మన్ గిరిబాబు

హాజరైన సభ్యులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు)

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిందని, ఈ కాలంలో మున్సిపాలిటీని ఎంతో అభివృద్ధి చేశానని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కార్యాలయం సమావేశ మందిరంలో చైర్మన్ గిరిబాబు అధ్యక్షతన శనివారం బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సహకారంతో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.3 కోట్ల నిధులతో రహదారులు, కాలువలు, రూ.కోటి నిధులతో విద్యుత్, రూ.వంద కోట్ల నిధులతో తాగునీటి సమస్య తీర్చేందుకు ఇంటింటికీ తాగునీటి కుళాయిల ద్వారా శుద్ధ జలం అందించేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. పాలక మండలి సభ్యుల సహకారంతో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్ ప్రతిపాదనలు, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలను వివరించారు. 2022-23 సంవత్సరపు సవరణ బడ్జెట్‌ను 2021-22 సంవత్సరంపు వర్షిక అకౌంట్‌లోని అంత్య నిలువ రూ.2838.26 లక్షల ఆధారంగా తీసుకొని తయారు చేశామని తెలిపారు. అలాగే 2023-24 సంవత్సరం బడ్జెట్ అంచనాలనూ 2022-23 సంవత్సరపు సవరించిన బడ్జెట్‌లోని సాధారణ, మూలధన ఖాతాల్లోని అంత్య నిలువలను ఆధారంగా తీసుకొని తయారు చేశామని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్, నష్ట పరిహారాలను పద్దుల డిమాండ్‌పై వంద శాతం పన్నులు వసూళ్లకు సంబంధించి 90 శాతం వరకు వసూళ్ల అంచనా రాబడిగా లెక్కించి ఆదాయంగా పరిగణలోకి తీసుకున్నామన్నారు. అంతకుముందు పద్దులపై టిడిపి కౌన్సిలర్ వజ్జ బాబూరావు మాట్లాడుతూ బడ్జెట్ కేవలం అంకెల గారిడిగా, తప్పులు తడకగా ఉందన్నారు. దీనిపై వైసిపి కౌన్సిలర్ దుర్గాశంకర్ పండా ఆక్షేపిస్తూ బడ్జెట్ సమావేశంలో రాజకీయాలు మాట్లాడవద్దని, మరో సందర్భంగా మాట్లాడుకుందామని సవాల్ విసిరారు. దీనిపై చైర్మన్ గిరిబాబు జోక్యం చేసుకొని అంచనా బడ్జెట్‌ను పారదర్శికంగా తయారు చేశామని, కేవలం బడ్జెట్‌పై చర్చించాలని సూచించారు. ఇన్‌ఛార్జి కమిషనర్ యాదం అప్పలస్వామి, ఎఇ అవినాష్, వైస్‌చైర్మన్లు బొర కృష్ణారావు, మీసాల సురేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో మత్స్యకారులకు అన్యాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న సూర్యనారాయణ

సముద్రతీర ప్రాంతంపైనే ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులపై రాష్ట్ర ప్రభుత్వం వివక్షతకు గురి చేస్తోందని, ఇతర సామాజిక తరగతుల కంటే బడ్జెట్ కేటాయింపుల్లో అతి తక్కువ నిధులు కేటాయించారని మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న మత్స్యకారుల సంఘం కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాత్రింబవళ్లు శ్రమ పడి ఏటా రూ.3,642 వేల కోట్లు విదేశీ మారకద్రవాన్ని వృద్ధి చేసి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూరుస్తుంటే... మత్స్యకారులకు బడ్జెట్‌లో రూ.175 కోట్లు కేటాయించడం తగదన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.2000 కోట్లు కేటాయించాలన్నారు. ఈ నాలుగేళ్లలో ఒక్క మత్స్యకారుడికీ తెప్ప గాని, బోటు గాని, ఇంజిన్ గాని, వల నూలు కర్ర గాని ఇవ్వలేదన్నారు. బడ్జెట్‌లో జెట్టీలు, మినీ జట్టీలు, ఫిషింగ్ హార్బర్ల ప్రస్తావనే లేదన్నారు. మత్స్యకారులపై ఇదే తీరు కొనసాగిస్తే భవిషత్ కోసం ఉద్యమ కార్యాచరణ తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మైలపల్లి పోలీసు, డైరెక్టర్ ఫిష్ కాన్, ఇద్ది పాపయ్య, వారధి సూర్యనారాయణ, కారి అప్పారావు, చీకటి శ్రీరామ్, సొసైటీ ప్రెసిడెంట్, దాసరి లక్ష్మణరావు, పేర్ల లక్ష్మణరావు, గంగాడ రామారావు, సొసైటీ ప్రెసిడెంట్ మైలపల్లి శంకర్ భగవాన్ పాల్గొన్నారు.

లేగ దూడలను పరిశీలిస్తున్న మన్మథరావు

లేగదూడల ప్రదర్శన

జి.సిగడాం : లేగ దూడలను సంరక్షించి కాపాడాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ శివ్వాల మన్మథరావు అన్నారు. మండలంలోని నడిమివలసలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన శనివారం లేగదూడలను ప్రదర్శించారు. ముందుగా ఈ ప్రదర్శనను ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్మథరావు లేగ దూడల పెంపకం ఆవశ్యకతను వివరించారు. లింగ నిర్ధారణ వీర్యాన్ని ఉపయోగించి ఆడ దూడలు పుట్టే పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వెటర్నరీ డాక్టర్ ఉప్పాడ సుమన్ దూడ యాజమాన్యం, పోషణ గురించి వివరించారు. ఈ ప్రదర్శనలో హెచ్ఎఫ్, జెర్సీ, గిర్ జాతులకు చెందిన ఆడ దూడలను తీసుకొచ్చి రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్ చంద్ర, డిఎల్ డిఎ డాక్టర్ ఎం.జానకిరామ్, వెటర్నరీ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఇకవైసిని చేయించుకోవాలి

పొందూరు: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, పెన్షన్‌దారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు వెంటనే ఇకవైసిని చేయించుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అంకం ధర్మారావు, పాలిశెట్టి సూర్యప్రకాశరావు ఒక ప్రకటనలో కోరారు. ఇక్కడి సబ్ ట్రెజరీ పరిధిలో 912 మంది పెన్షనర్లు ఉన్నారని అన్నారు. వీరిలో 234 మంది మాత్రమే ఇకవైసిని చేయించుకున్నారని, మిగిలిన వారూ త్వరగా చేయించుకోవాలని కోరారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపిపి ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ ప్రతినిధి నర్తు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ నాడు-నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు అమ్మఒడి, విద్యాదీవన వంటి పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగిన పౌరులుగా ఈ పాఠశాలకు ఈ రాష్ట్రానికి మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి దువ్వు వివేకానందరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ, స్కూల్ పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు సీరపు నరసింహమూర్తి, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహుమతులను అందజేస్తున్న ఎంపిపి నారాయణమ్మ

వేలంపాట నిర్వహిస్తున్న కమిషనర్ రమేష్

వేలంపాట వాయిదా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆశీలు వసూలు చేసుకునేందుకు అధికారులు శనివారం నిర్వహించిన బహిరంగ వేలం పాట వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్ ప్రకటించారు. అనుకున్న సమయానికి వేలం పాటకు ఎనిమిది మంది మాత్రమే పాటదారులు పాల్గొన్నారు. ఒక వైపు అధికారులు డైలీ మార్కెట్, వీధి గుత్త మూడేళ్ల పాటు తీసుకునేందుకు రూ.16 లక్షలకు పాట ప్రారంభించారు. పాటకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంటే... సమావేశం మందిరం బయట పాటదారులు సిండికేట్‌గా మారారు. పాటను అధికంగా పెంచకుండా చేసేందుకు ప్రయత్నాలు చేశారు. దీనిని గుర్తించిన కమిషనర్ అనుకున్న స్థాయిలో పాట పాడేందుకు పాటదారులు ముందుకు రాలేదని చెప్పి ఈ నెల 27న మళ్లీ బహిరంగ వేలం పాట నిర్వహిస్తామని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

ప్రస్తుతం నడుస్తున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.23 లక్షలకు పాడారని, ఈ సారి రూ.20 లక్షల కూడా పాట పాడేందుకు ముందుకు రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వేలం దక్కించుకొని చాలా నష్టపోయామని, అందుకే ఎక్కువ మొత్తంలో పాడేందుకు ముందుకు వెళ్లడం లేదని పాటదారులు అంటున్నారు. ఏదేమైనా పాట దారులు వ్యూహం బెడిసి కొట్టినట్లయింది. ఈ వేలం పాటలో మున్సిపల్ మేనేజర్ హరిమోహన్, ఆర్ఐ అమర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి- రణస్థలం

గ్రామ సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జె.ఆర్.పురం 1,2 గ్రామ సచివాలయం నాయకులతో, కన్వీనర్లతో, గృహ సారథులతో, వాలంటీర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరవేయాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. సర్పంచ్‌లతో, ఎంపిటిసిలతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ లంకలపల్లి ప్రసాద్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, వైస్ సర్పంచ్ రాయిపురెడ్డి బుజ్జి, కో ఆప్షన్ సభ్యులు షేక్ సైదల్, జె.ఆర్.పురం సర్పంచ్ భవిరి రమణ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న సత్యవతి

మునగవలసలో 'చేయి చేయి కలుపుదాం'

ఆమదాలవలస : ప్రజా సమస్యల పరిష్కారం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని జిల్లా డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. మండలంలోని మునగవలసలో ఎఐసిసి, పిసిసి ఆదేశాల మేరకు ఇంటింటియా తిరిగి చేయి చేయి కలుపుదాం–రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దామని శనివారం ప్రజలతో కలిసి నడిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు నియంతృత్వ పరిపాలనను కొనసాగిస్తూ ప్రతిపక్షాలపైన కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నాయని మండిపడ్డారు. సామాన్యుల బాగోగులను పట్టించుకోకుండా నిరంకుశ ధోరణిలో వ్యవహరిస్తున్నాయన్నారు. గ్యాస్, నిత్యవసరాల ధరలు సామాన్యులకు అందుబాటులోకి రావాలన్నా, అభివృద్ధి, ప్రజా సంక్షేమం కొనసాగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బస్వా షణ్ముఖరావు, విజయలక్ష్మి, లఖినేని సాయిరాం, బొత్స రమణ, దాలయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న నారాయణరావు

సంస్కృతి పరిరక్షణ బాధ్యత యువతదే

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

భారతీయ సంస్కృతిక, సాంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యతను యువత స్వీకరించాలని జిల్లా పర్యాటకశాఖ అధికారి నడిమింటి నారాయణరావు అన్నారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల పర్యాటక విభాగం విద్యార్థినులతో 'డచ్ బంగ్లా హెరిటేజ్ వాక్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో విద్యాసంస్థల్లో యువ పర్యాటక క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వీటి ద్వారా కళింగపట్నం హెరిటేజ్ వాక్ వంటి క్షేత్ర సందర్శనల ద్వారా విద్యార్థులకు పర్యాటక ప్రదేశాలపై అవగాహన కలుగుతుందని అన్నారు. అనంతరం ప్రిన్సిపాల్, పర్యాటక విభాగ అధ్యాపకులు బి.వరలక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎపిఒ వావిలపల్లి జగన్నాథనాయుడు, పర్యాటక కౌన్సిలర్ యార్లగడ్డ గీతాశ్రీకాంత్, డి.రమేష్, సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పూర్వ కమిషనర్ మృతికి సంతాపం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘం పూర్వ కమిషనర్ ఎస్.గోవిందస్వామి శనివారం హఠాన్మరణానికి పురపాలక సంఘం అధికారులు, సిబ్బంది సంతాపం తెలియజేశారు. ఈ మేరకు కార్యాలయం ఆవరణలో గోవిందస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కమిషనర్ కె.అప్పలనాయుడు, మేనేజర్ బి.లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ వృత్తిరీత్యా నిబద్ధతతో పనిచేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. కాగా గోవిందస్వామి శుక్రవారం సాయంత్రం విశాఖపట్నంలో తన నివాసంలో అకస్మాత్తుగా మృతి చెందారు. ఈయన ఆమదాలవలస పురపాలక సంఘానికి 29 ఆగస్టు 2005 నుంచి 25 జూన్ 2006 వరకు కమిషనర్‌గా పనిచేశారు. సంతాపం తెలిపిన వారిలో టి.పి.ఎస్.హెచ్.వి సత్యనారాయణ, అకౌంటెంట్ ఐ.సాయిరాం, ఎ.వి.శ్రీనివాస్, ఎస్.హరీష్, జి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాసరావు, కె.రాజేష్‌కుమార్, టి.గిరిబాబు, పెంటయ్య, బాబూరావు, రవి పాల్గొన్నారు.

చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కమిషనర్ అప్పలనాయుడు

పోషకాహారంతోనే ఆరోగ్యం

పొందూరు : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బంది

ప్రజాశక్తి- జలుమూరు

అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని చల్లవానిపేట-1 ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. జోనంకి-1 అంగన్వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన పోషణ్ పక్వాడలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడో నెల నుంచి రెండేళ్ల పిల్లలకు ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని పిల్లలకు తినిపించాలన్నారు. కిశోర బాలికలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త అన్నపూర్ణ, ఎఎన్ఎం, సచివాలయ సిబ్బంది, ఆయాలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని మండపల్లి సర్పంచ్ ప్రతినిధి పిట్ట మాధయ్య అన్నారు. పంచాయతీ కార్యాలయంలో పోషణ పక్వాడాలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త నరసమ్మ, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

పలాస: పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మండలంలోని లొత్తూరు పంచాయతీ పరిధిలో కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టులో పలాస-1 సెక్టారు సార్యంలో పౌష్టికాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్, సర్పంచ్ ప్రతినిధి, మాజీ సర్పంచ్, ఐసిడిఎస్, సిడిపిఓ, సూపర్‌వైజర్లు, కార్యదర్శి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు: పౌష్టికాహార లోపాలను గుర్తించి అధిగమించడం ద్వారా పుట్టబోయే బిడ్డకు, పుట్టిన బిడ్డకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించవచ్చునని సిడిపిఒ డి.పాపినాయుడు అన్నారు. పోషణ పఖ్వాడా వేడుకలలో భాగంగా స్థానిక మండల కేంద్రంలో 23వ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో లభించే అధిక విలువలున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు తమ్మినేని లక్ష్మి, ఆయమ, జి.వి.రత్నం, యశోద, బెజ్జిపురం యూత్‌క్లబ్ సభ్యులు, చైల్డ్‌లైన్ సభ్యులు పాల్గొన్నారు.

జలుమూరు : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సుజాత

'ఆసరాతో అతివల్లో ఆనందం'

ప్రజాశక్తి- ఆమదాలవలస

స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న వైఎస్ఆర్ ఆసరా అతివల్లో ఆనందాన్ని నింపిందని ఇందిరా క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామీణ మహిళలు అక్కివలస రైతు భరోసా కేంద్రం వద్ద ర్యాలీ నిర్వహించారని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులతో జీవనోపాధులు మెరుగుపరుచుకోవడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధపరుస్తున్నట్టు వివరించారు.

పోలాకి: సిఎం జగన్ మోహన్‌రెడ్డి తన ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశారని ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు అన్నారు. వెలుగు కార్యాలయంలో నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, ఎపిఎం జి.రాజారావు, వైసిపి నాయకులు ఆర్ త్రినాథరావు, వెలుగు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే ప్రాంత అభివృద్ధి చెందుతుందని సదుద్దేశంతో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ ఆసరా ద్వారా డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేశారని పాగోడు సర్పంచ్ దామ మన్మథరావు అన్నారు. పాగోడు సచివాలయంలో ఆసరా మూడో విడతను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చెన్నాయివలస సర్పంచ్ బి.ప్రసాద్, వెలుగు సిసి రమణ, సిఎఫ్, గ్రామ సమైక్య అధ్యక్షులు నేతింటి నీలిమ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : రుణమాఫీని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ పిరియా లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి అన్నారు. కమిషనర్ రమేష్ అధ్యక్షతన బెల్లుపడ సచివాలయంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. అలాగే ఎంపిపి బోర పుష్ప ఆసరాపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక లోకేశ్వరరావు, త్రినాథ్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న సంఘ సభ్యులు

'నాడు-నేడు' పనులపై సమీక్ష

ప్రజాశక్తి- ఆమదాలవలస

మొదటి విడత ఫేస్-1లో 34 పాఠశాలలకు సంబంధించి మండల స్థాయిలో 22, మున్సిపాలిటీ స్థాయిలో 12 పాఠశాలలకు సంబంధించి పనుల ప్రగతి, వచ్చిన నిధులను రెకాన్సిలేషన్ చేసుకుని పూర్తి సమాచారం మండల రిసోర్స్ కేంద్రానికి అప్పగించాలని ఎంఇఒ డి.రామారావు హెచ్ఎంలకు ఆదేశించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా చేపడుతున్న అభివృద్ధి పురోగతిపై హెచ్ఎంలతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండో విడత 37 పాఠశాలల్లో నాడు-నేడు పనులకు సంబంధించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. మండల విద్యా సంక్షేమ అధికారి, ఎపిఎం పైడి కూర్మారావు మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లల ఆరోగ్యానికి సంబంధించి కాల్షియం, ఐరన్ పుష్కలంగా ఉండే బెల్లము, రాగి పిండితో తయారు చేసిన రాగి మాల్టును పిల్లలందరూ సక్రమంగా తీసుకొని తాగే విధంగా చూసే బాధ్యతను ఉపాధ్యాయులదేనని అన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ రమణ, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న ఎంఇఒ రామారావు

ఎపిపిఎస్‌సి పరీక్షల గడువు పెంచాలి

మాట్లాడుతున్న ప్రహర్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 మెయిన్స్ గడువు మరో 3 నెలలు పెంచాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బలగ ప్రహర్ష ప్రభుత్వానికి కోరారు. నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. నోటిఫికేషన్ విడుదల చేసి తక్కువ గడువులో ఎపిపిఎస్‌సి పరీక్షలు నిర్వహించడం వల్ల అభ్యర్థుల్లో ఆందోళన ఉందన్నారు. కనీసం చదువుకునేందుకు అవకాశం ఇవ్వకుండా అభ్యర్థులకు అన్యాయం చేస్తున్నారన్నారు. నాలుగేళ్లలో ఒక్కసారి నోటిఫికేషన్ విడుదల చేయకుండా మొక్కుబడిగా ఎన్నికల ముందు ఏడాది ఉండగా నోటిఫికేషన్ ఇచ్చి చదువుకోవడానికి సమయం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. పరీక్షల నిర్వహణకు కనీసం 90 రోజులు అదనపు గడువు కేటాయిస్తే అభ్యర్థులు పోటీ పరీక్షల్లో నెగ్గేందుకు వీలుంటుందన్నారు. సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ జనరల్ సెక్రటరీ సుమంత్ గురాల, వైస్ ప్రెసిడెంట్ జమ్ము సంతోష్‌కుమార్, టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు రెడ్డి గిరిజాశంకర్, పార్లమెంట్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ మెండ గిరీష్ ప్రతాప్ పాల్గొన్నారు.

ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.వి.సత్యనారాయణ ప్రభుత్వానికి కోరారు. పట్టణంలోని ప్రయివేట్ ఎలక్ట్రిషన్ వర్కర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయివేట్ ఎలక్ట్రిషన్ అసోసియేషన్ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వర్కర్స్ జీవన స్థితిగతులపై రెండో విడత సర్వేను ఇచ్ఛాపురం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి హరిరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ జీవన స్థితిగతులపై 2018లో సర్వే చేశామని అన్నారు. ప్రయివేటు ఎలక్ట్రికల్ రంగంలో 5 లక్షల మంది కార్మికులుగా ఉన్నారని తెలిపారు. ఎలక్ట్రికల్ కార్మికుల సమస్యలను సేకరించి వాటి పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎలక్ట్రికల్ కార్మికుల సంక్షేమ సమగ్ర సర్వే యాత్ర రెండో విడతను మరలా ఇచ్ఛాపురం నుంచి ప్రారంభించామని తెలిపారు. వృత్తిపరమైన సామగ్రి కొనుగోలుకు రుణాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో చిన్నారావు, శ్రీను, హరిబాబు, రవణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

నేడు రక్తదాన శిబిరం

వజ్రపుకొత్తూరు : ఈనెల 26న పూండిలోని సాయి వినీత్ విద్యాసంస్థ ప్రాంగణంలో మెగా రక్తదాన శిబిరం, వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యువతరం సేవా సంస్థ అధ్యక్షులు చింత మురళి ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాన శిబిరాన్ని ప్రాణదాత బ్లడ్ న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో నిర్వహిస్తున్నామని అన్నారు. మెగా వైద్య శిబిరంలో మెడికవర్ ఆస్పత్రి వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగం చేసుకోవాలని కోరారు.

కుళాయి వద్ద ఉన్న బకెట్లు

తాగునీటి కటకట

లావేరు : మండలంలోని గుమడం పంచాయతీ గుమడం, వాళ్లేపేట, వేణుగోపాలపురం, నాగపురం గ్రామాల్లో మూడు రోజులుగా తరచూ విద్యుత్ కోతలు విధిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాలకు కుళాయి ద్వారా తాగునీరు సరఫరా కాకపోవడంతో నీటికి కటకటలాడుతున్నారు. ఈ విషయంపై విద్యుత్‌శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సమీపంలోని చేతిపంపులు, చెరువుల్లో నీరు అడుగంటాయని అన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించి విద్యుత్‌ను సరఫరా చేయాలని కోరుతున్నారు.

కంఠ వేణుకు డాక్టరేట్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రతిష్టాత్మకమైన హోలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ ఆనంద్ కుమార్, బిషప్ డాక్టర్ జి సామ్యూల్ జాన్ చేతుల మీదుగా దళిత సంఘాల నాయకులు కంఠవేణుకు గౌరవ డాక్టరేట్ అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో హోలీ గాడ్ కాన్వకేషన్ హాల్‌లో ఈ డాక్టరేట్‌ను శనివారం అందుకున్నారు. ఈ సందర్భంగా వేణుకు త్రైక్వాండో శ్రీను, ఉదయ్ భాస్కర్, సివేరి అబ్రహం, యజ్జల గురుమూర్తి, పిట్ట చంద్రపతిరావు, బోనేల సన్యాసిరావు అభినందనలు తెలిపారు.

డాక్టరేట్‌ను అందుకున్న కంఠవేణు

రాహుల్ సభ్యత్వం రద్దు చేయడం తగదు

ఆమదాలవలస : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీపై కేంద్ర ప్రభుత్వం పరువు నష్టం కేసు బనాయించి రెండేళ్ల జైలు శిక్ష విధించి సభ్యత్వం రద్దు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బిసి సెల్ చైర్మన్ జిల్లా పార్లమెంటరీ పార్టీ ఇన్‌ఛార్జి సనపల అన్నాజీరావు అన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మోడీని విమర్శించినందుకు జైలుకు వెళ్లాలంటే... దేశంలోని లక్షలాదిమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మోడీని విమర్శించి జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. క్షమాపణలు చెప్పి పారిపోవడానికి సావర్కర్ వారసులం కాదని, దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన కాంగ్రెస్ పార్టీ వారసులమని గుర్తు పెట్టుకోవాలని అన్నారు. మోడీ నియంతృత్వ ప్రభుత్వానికి తరిమి కొట్టడానికి రోజులు దగ్గరలో ఉన్నాయని హెచ్చరించారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

45 మందికి వైద్య పరీక్షలు

పొందూరు : మండలంలోని తండ్యాంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన శనివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కిలారి భాస్కరరావు, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ధ్రువపత్రాన్ని అందజేస్తున్న సభ్యులు

ఘనంగా 'యురేకా విలేజ్ లైబ్రరీ' మేళా

పొందూరు: మండలంలోని బురిడికంచరాంలో ఎబిడి ఇండియా ఆధ్వర్యాన యురేకా విలేజ్ లైబ్రరీ మేళాను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ సూర్యనారాయణ విద్యార్థులకు లైబ్రరీ ఆవశ్యకత, మేళాపై అవగాహన కల్పించారు. అనంతరం ఐరుకిరే వారి ధ్రువపత్రం, మూడు ట్యాబులు, స్కెచ్ పెన్నులు, పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పి.వేణుగోపాలరావు, పి.ఉషారాణి, జి.ఎ.నాయుడు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న రామ్మూర్తి

రామ్మూర్తి ఆర్థికసాయం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని గొల్లపేటకు చెందిన కోరాడ శ్రీనివాసరావు రెండు కిడ్నీలూ పాడై అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యం చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు మజ్జి రామ్మూర్తి... టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు పుట్టిన రోజును పురస్కరించుకుని బాధితుడికి రూ.3 వేలు ఆర్థికసాయం శనివారం అందజేశారు. భవిష్యత్‌లో ఎటువంటి సహాయం కావాలన్నా బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో దేవసం ఎంపిటిసి దన్నాన వంశీకృష్ణ, తిప్పాన బాబూరావు, జగ్గారోతు దుర్గాప్రసాద్, జగ్గారోతు రామకృష్ణ, కెల్ల గోపాల్, ఇప్పిలి తవుడు, కోరాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

'ఎర్త్ అవర్'పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి- పలాస

ప్రతిఒక్కరూ ఎర్త్ అవర్‌ను పాటించాలని బ్రాహ్మణతర్లా పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.రమణారావు అన్నారు. ఎర్త్ అవర్‌కు సంబంధించి జాతీయ హరిత దళం క్లబ్, జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్‌ల ఆధ్వర్యాన పాఠశాల ఆవరణలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శనివారం రాత్రి ప్రతిఒక్కరూ 8.30 నుంచి 9.30 గంటల వరకు తమ ఇంట్లో విద్యుత్ ఉపకరణాలు గంట పాటు నిలుపుదల చేసి ఎర్త్ అవర్ పాటించాలన్నారు. దీనివల్ల విద్యుత్ పొదుపుతో పాటు భూమిని పర్యావరణాన్ని పరిరక్షించుకుంటామన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్లస్టర్ కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.